

వేకువజామునే పింఛన్లు..!



ఆత్మకూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

జిల్లా వ్యాప్తంగా శనివారం వేకువజాము నుంచే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే శనివారం నాడు పింఛన్లు అందించారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్ల బయోమెట్రిక్ తీసుకుని పింఛన్ నగదు రూ.4వేలను అందించారు. ఆత్మకూరు మండల కేంద్రంలో కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ సచివాలయ సిబ్బందితో కలిసి ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లవద్దకెళ్లి పింఛను అందించారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

అప్పుడు అనావృష్టి- ఇప్పుడు అతివృష్టి

రెండు రోజులుగా జడివాన



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గతేడాది తీవ్ర వర్షాభావం నెలకొనగా ఈసారి అధిక వర్షపాతం నమోదవుతోంది. గడిచిన రెండు రోజులుగా జడివాన పడుతూనే ఉంది. ఇదే ఏడాది జులైలో వర్షాభావ పరిస్థితులే నెలయిఅని ఉండేవి. ఆగస్టు రెండవ వారం నుంచి వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఆగస్టులో ఇప్పటి వరకు సాధారణం కంటే 151 శాతం అధికంగా వర్షపాతం నమోదవడం గమనార్హం.

జులైలో వర్షాభావం -ఆగస్టులో అత్యధికం

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమైన జూన్ నెలలో అనంతపురం జిల్లాలో అత్యధికంగా వర్షపాతం నమోదయింది. ఆ నెల సాధారణ వర్షపాతం 61 మిల్లీమీటర్లు అయితే పడింది 147.7 మిల్లీమీటర్లు. సాధారణం కంటే ఆ నెలలో 142.1 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. జులై మాసంలో సాధారణ వర్షపాతం 63.9 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా కేవలం 24.4 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. సాధారణం కంటే 61,8 శాతం తక్కువగా వర్షపాతం నమోదయింది. ఆగస్టులో రెండవ వారం వరకు వర్షాభావ పరిస్థితులే ఉన్నాయి. ఆ తరువాతి నుంచి పడుతున్న వర్షాలు అధికంగా ఉన్నాయి. మొత్తంగా చూసినప్పుడు ఆగస్టు నెలలో సాధారణ వరర్షపాతం 83.8 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 211.1 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 151.7 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. మండలాల వారీగా చూసినప్పుడు డీ.హీరేహళ్ మండలంలో 304 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. ఇక్కడ సాధారణ వర్షపాతం ఆగస్టులో 46.1 మిల్లీమీటర్లు అయితే పడింది 186 మిల్లీమీటర్లు. పామిడిలో 294 శాతం అధికంగా పడింది. 61.2 మిల్లీమీటర్లకుగానూ 241.6 మిల్లీమీటర్లు నమోదయింది.

గతేడాది వర్షాభావం

గతేడాది ఇదే సమయంలో జిల్లాలో తీవ్ర వర్షాభావం నెలకొంది. జూన్ నెలలో పోయిన సంవత్సరం 61 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 45.8 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదయింది. 24.9 శాతం తక్కువ పడింది. జులై నెలలో 63.9 మిల్లీమీటర్లకుగానూ 73.3 మిల్లీమీటర్లు పడింది. 14.7 శాతం అధికంగా పడింది. ఆగస్టు నెలలో 83.8 మిల్లీమీటర్లుకుగానూ 13.7 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. 83.7 శాతం తక్కువ పడింది. మొత్తంగా చూసినప్పుడు గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 28 మండలాలు కరువు మండలాలుగానూ ప్రభుత్వం ప్రకటంచింది. ఈ ఏడాది కీలకమైన జులై నెలలో వర్షాభావం నెలకున్నా, ఆగస్టులో అత్యధికంగా నమోదవడం గమనార్హం.



యువతోత్సాహం

◆ దులీప్ క్రికెట్ టోర్నీకి పాసుల పంపిణీ షురూ

◆ పాస్‌ల కోసం వేలాదిగా తరలొచ్చిన క్రికెట్ అభిమానులు

◆ 5వ తేదీ నుంచి దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్

◆ 'అనంత'కు జాతీయ స్థాయి క్రికెటర్లు రాక

◆ అరుదైన అనుభూతినిచ్చే వేడుక

◆ ఏసీఏ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంఛో ఫెర్రర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురంలో క్రికెట్ సందడి మొదలైంది. ఆర్డీటీ క్రీడాగ్రామం వేదికగా దిగ్గజ క్రికెటర్లు క్రీడాభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. జాతీయ స్థాయి క్రికెటర్లతో కూడిన దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌కు అనంతపురం వేదికకానుంది. అనంతపురం నగర శివారులోని ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీలో 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. మ్యాచ్‌లు వీక్షించేందుకు శనివారం పాస్‌లు జారీ చేయడంతో క్రికెట్ అభిమానులు వేలాదిగా ఆర్డీటీ స్టేడియంకు చేరుకున్నారు. శనివారం ఉదయం నుంచే యువత పెద్ద ఎత్తున ఆర్డీటీ స్టేడియం వద్దకు చేరుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు బందోబస్తు మధ్య దాదాపు 10 వేల పాస్‌లు పంపిణీ చేశారు. పాస్‌లు పొందిన యువత సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ అభిమాన క్రికెటర్లను చూడబోతున్నామంటూ ఆర్డీటీ స్టేడియం వద్ద సందడి చేశారు.

ఇదొక గొప్ప అవకాశం..

అనంతపురం జిల్లాలో దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప అవకాశం అని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంఛో ఫెర్రర్ అన్నారు. శనివారం ఆయన టికెట్ పంపిణీతో పాటు స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాంఛో ఫెర్రర్ మీడియాతో మాట్లాడుతూ క్రికెట్ ప్రేమికులకు ఇదొక అరుదైన అనుభూతినిచ్చే వేడుక అన్నారు. అంతర్జాతీయ పోటీల తర్వాత జాతీయ క్రీడాకారులకు అత్యంత ప్రధానమైనది దులీప్ ట్రోఫీ అన్నారు. స్పోర్ట్స్ విలేజ్‌లో ఒకేసారి రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ ప్రేక్షకులు తిలకించేందుకు ఒక మైదానంలోకి మాత్రమే అనుమతిస్తామన్నారు. బి గ్రౌండ్‌లో కూర్చుకునేందుకు ఎలాంటి సౌకర్యాలూ లేనందున అక్కడికి ఎవరినీ అనుమతించరన్నారు. మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్, జియోలో ప్రత్యక్ష ప్రసారం అవుతాయని వెల్లడించారు. మ్యాచ్ నిర్వహణ కోసం క్రికెట్ అభిమానులు సహకరించాలని కోరారు. మ్యాచ్‌లు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరిస్తే మున్ముందు అనంతపురం జిల్లాకు బీసీసీఐ మరిన్ని మ్యాచ్‌లు కేటాయించేందుకు అవకాశం ఉంటుందని మాంఛో ఫెర్రర్ పేర్కొన్నారు.

భారీ భద్రత..

క్రికెట్ మ్యాచ్‌కు పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. మ్యాచ్ నిర్వహించే సమయంలో స్టేడియం చుట్టు పక్కల పెద్ద ఎత్తున పోలీసు బలగాల పర్యవేక్షణ ఉంటుందని అనంతపురం రూరల్ డీఎస్పీ ఎంవి.శివారెడ్డి వెల్లడించారు. స్టేడియం సమీపంలోనే ప్రత్యేకంగా వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. మ్యాచ్‌లు జరిగే రోజున ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు మాత్రమే గ్రౌండ్‌లోకి ప్రవేశం ఉంటుందన్నారు. ఆ తర్వాత గేట్లు మూసివేస్తామని తెలిపారు.



మ్యాచ్‌లను చూసేందుకు జారీ చేసే పాస్‌ల కోసం ఆర్డీటీ స్టేడియం వద్ద క్యూలో నిల్చున్న క్రికెట్ అభిమానులు



పాస్ పంపిణీని ప్రారంభిస్తున్న డీఎస్ప శివారెడ్డి

విజయవంతంగా నిర్వహించాలి : కలెక్టర్

ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో నిర్వహించే దులీప్ ట్రోఫీని అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం నాడు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో దులీప్ ట్రోఫీపై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాచ్‌లను తిలకించేందుకు పాఠశాల విద్యార్థులకు రెండవ మ్యాచ్ నుంచి అనుమతి ఉంటుందని, పిల్లలు వారి పాఠశాల ఐడి కార్డులు, యూనిఫామ్ తో మ్యాచ్ తిలకించేందుకు రావాలని తెలిపారు. దులీప్ ట్రోఫీ సందర్భంగా మీడియా కవరేజీ ఫొటోలు, వీడియోలు వారిని సమన్వయంగా పనిచేయాలన్నారు. మీడియాకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు, వీరికి సంబంధించిన పాసులను ఏర్పాటు చేయాలని డిఐపిఆర్ఒను ఆదేశించారు.

దుర్భరంగా సుల్తాన్‌పేట ఇందిరమ్మ కాలనీ

దారులన్నీ బురదమయం-స్థానికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని సుల్తాన్‌పేట ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటే ప్రజల పరిస్థితి దుర్భరంగా మారింది. పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. అయితే మౌలిక సౌకర్యాలు కల్పించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయంగా మారుతున్నాయి. బురదలో వెళ్లలేక ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సరైన రోడ్లు లేకపోవడంతోపాటు విద్యుత్ సౌకర్యం లేక నానాతిప్పలు పడుతున్నారు. విద్యుత్ ఏర్పాటు కోసం గత కొద్దికాలం క్రితం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారుగానీ, కనెక్షన్ మాత్రం ఇవ్వలేదని స్థానికులు వాపోతున్నారు. సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రత్యేక చొరవ తీసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి సుల్తాన్ పేట ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన కాలనీ దారి

కొనసాగిన 'సత్యసాయి' కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-నార్పల

పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ మండల పరిధిలోని బి.పప్పూరు పంప్‌హౌస్ వద్ద చేపట్టిన సత్యసాయి కార్మికులకు చేపట్టిన ఆందోళన శనివారం 10వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆందోళన చేస్తున్నల్లు తెలిపారు. పది రోజులుగా సమ్మె చేస్తున్న అధికారులు, ప్రభుత్వం మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగభూషణ, అంకన్న, పుల్లానాయుడు, శరత్‌బాబు, శ్రీరాములు, చంద్రమోహన్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సత్యసాయి కార్మికులు

చదువుతోపాటు సంస్కారం ముఖ్యం

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

విద్యార్థులకు చదువుతోపాటు ప్రవర్తన, సంస్కారం చాలా ముఖ్యమని ఎస్పీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. జిల్లాకు చెందిన పోలీసు పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ డిజిపి ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు మేరకు 2023-24లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన 74 మంది పోలీసు పిల్లలకు రూ.4,40,500 విలువజేసే మెరిట్ స్కాలర్‌షిప్పులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రుల పెంపకం, సహవాసం క్యారెక్టర్ నిర్ణయిస్తాయన్నారు. ఆత్మ విశ్వాసంతో ముందుకెళితే ఏదీ అసాధ్యం కాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మంచీ,చెడులు మనపక్కనే ఉంటాయి. ఎంచుకోవడంలోని మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. దీనికితోడు అభివృద్ధి, భవిష్యత్తు కూడా మన చేతుల్లోనే ఉంటుంది. ఇకపోతే తల్లిదండ్రులు నిత్యం విధుల్లో ఉంటూ తక్కువ సమయం కేటాయించినా మంచి మార్కులు సాధించడం సంతోషకరమన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి, ఏ.ఆర్ డీఎస్పీ జి.మునిరాజ, ఏ.ఓ శంకర్, ఆర్ఐలు కె.రాముడు, మధు, ఎస్‌బి ఎస్ఐ వెంకటక్రిష్ణ, బి.సూపరింటెండెంట్ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, జిల్లా అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులనాయుడు, తేజ్‌పాల్, లక్ష్మీనారాయణ, సరోజ, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్పీ పి.జగదీష్

మధ్యాహ్న భోజనం కార్మికుల తొలగింపులు ఆపాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై తొలగింపులు, రాజకీయ వేధింపులను తక్షణమే ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల బలవంతపు తొలగింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. 23ఏళ్ల నుంచి పని చేస్తున్న వర్కర్లను ఎలాంటి తప్పు చేయకపోయినా భయపెట్టి తొలగించడం బాధాకరమన్నారు. విద్యాశాఖ అధికారి, కలెక్టర్ ఉత్తర్వులను సైతం లెక్కజేయకుండా స్థానిక రాజకీయ నాయకులు ఏది చెబితే అది ఎంఇఒలు అమలు చేస్తున్నారని విమర్శించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 670 స్కూళ్లలో 1500 మందికిపైగా మహిళలను రోడ్డుపాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కూడా ఆత్మకూరు మండలం జెడ్పీహెచ్ స్కూల్ కార్మికురాలు జయమ్మ, బొమ్మనహాల్ మండలంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించారన్నారు. వీటికి ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాలన్నారు. తొలగించిన వారందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



వ్యవసాయ అధికారులు, ఉద్యానవన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం తరుపున అన్ని విధాలా సాయం అందించేందుకు వ్యవసాయ శాఖ ద్వారా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. శనివారం నాడు మండల పరిధిలోని బి.యాలేరు సచివాలయం వద్ద మొక్కలు నాటి అనంతరం రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను, రైతు ఈశ్వరయ్యకు చెందిన చీని పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయం మీద నుంచి నీరు వెళ్లేలా ఏర్పాటుచేసిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను జాగ్రత్తగా నిర్వహణ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. బి.యాలేరు గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు, ఇంకుడు గుంతలు (సోప్ పిట్స్) ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారని, వాటిని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, తహశీల్దార్ లక్ష్మా నాయక్, ఎంపీడీవో శివశంకర్, ఏపీడీ అనురాధ, సర్పంచి రేణుకమ్మ, ఏపీవో విజయకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు ఈశ్వరమ్మ, పుష్పాంజలి పాల్గొన్నారు.

జెఎల్.మురళీధర్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-అనంతపురం



డాక్టరేట్‌ను అందుకుంటున్న జెఎల్.మురళీధర్

టిడిపి రాష్ట్ర కార్య దర్శి, అనంతపురం అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్. మురళీధర్ డాక్టరేట్‌ను శనివారం అందుకున్నారు. బ్యాంకింగ్ రంగంలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి, సామాన్యుల చెంతకు బ్యాంకును చేర్చడంలో విశేష కృషి చేసిన ఆయనకు ఆసియన్ ఇంటర్నేషనల్ కల్చర్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందించారు.

ఇసుక స్టాక్‌యార్డులో కెమెరాలు ఏర్పాటు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఇసుక స్టాక్‌యార్డుల్లో క్లోజ్ సర్క్యూట్ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఇసుక పాలసీ కమిటీ ఛైర్‌పర్సన్, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మతో కలిసి జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తోందన్నారు. ప్రజలకు సులభతరంగా ఉచితంగా ఇసుక అందించేందుకు జిల్లా ఇసుక పాలసీ కమిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో నిర్ణయించిన ధరకే ఇసుక రవాణా చేయాలని, జిల్లాలో అనధికారిక తవ్వకాలు, రెవెన్యూ, పోలీస్, వారితో ఇసుక రవాణాను అరికట్టడానికి జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జుంజురాంపల్లి స్టాక్ పాయింట్ ఇసుక లోడింగ్‌పై నిఘా ఉంచేందుకు స్టాక్‌యార్డులో క్లోజ్ సర్క్యూట్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇసుక రవాణా చేసే వాహనాలను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఎపి మైన్స్ పోర్టల్‌లో ఈరోజు నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎవరైనా వాహనదారులు నమోదుకు ఆసక్తి ఉంటే నమోదు చేసుకోవచ్చన్నారు. ఇసుక రవాణా చేసే ప్రతి ఒక్క వాహనం రిజిస్టర్ అయి ఉండాలన్నారు. కనేకల్ మండలం రచ్చుమర్రి వద్ద 13,278 మెట్రిక్ టన్నుల ఇసుక సీజ్ చేసినట్లు తెలిపారు. దీన్ని ఎస్పీ, జాయింట్ కలెక్టర్ పరిశీలించి న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చూడాలని ఆదేశించారు. ఇసుకపై ఫిర్యాదులు తెలిపేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-6039, 08554-298380 నెంబర్లను ఉపయోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీవో రాణిసుస్మిత, మైన్స్ డిడి నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం కార్యక్రమాల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వినాయక చవతి ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ జగదీష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలు నిబంధనల మేరకు సామరస్యంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. శనివారం సాయంత్రం నగరంలోని మేయర్ ఛాంబర్‌లో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డితో కలిసి అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఏ సమయంలోనైనా వర్షం ఎక్కువగా కురిసే అవకాశం ఉంటుందని, అధికారులందరూ కచ్చితంగా అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడ మురుగు కాలువల్లో నీరు నిలబడకుండా వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ప్రధాన వంకల్లో పూడిక తీశామని పెద్ద కల్వర్టులు, వంతెనల వద్ద చెత్తాచెదారం ఆగి ఉందన్నారు. వాటిని తొలగించాలన్నారు. ముఖ్యంగా రజకనగర్‌లోకి కొద్దిపాటి వర్షం వస్తేనే మురుగునీరు, వర్షం నీరు ఇళ్లలోకి వెళ్లే ప్రమాదం ఉండటంతో ఏర్పాట్లు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా ఇతరత్రా వైరల్ ఫీవర్ ఎక్కువగా ఉండడంతో ఎప్పటికప్పుడు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిల్వ ఉన్నటువంటి చెత్తాచెదారం, ఖాళీ టెంకాయలు, ఇతర వ్యర్థాలు ఇళ్ల వద్ద లేకుండా చేయాలన్నారు. ఎక్కడైనా పాత భవనాలు ఉంటే ఆ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తేమ ఎక్కువగా ఉండడంతో పారిశుధ్యం పై ఎక్కువగా దృష్టి పెట్టాలన్నారు. వర్షం కురుస్తుండడంతో నీరు నిలువ ఉండే అవకాశం ఉందని ఎక్కడైనా పైపులైను లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంహెచ్ఒ విష్ణుమూర్తి, ఇన్‌ఛార్జి ఎస్ఇ సూర్యనారాయణ, ఇఇ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

ఆత్మకూరు సిఐ, సిబ్బందికి అభినందనలు

ఆత్మకూరు : ఆర్టీసీ బస్సులో గత సోమవారం బంగారు నగలు కాజేసిన కేసును గంటలలోపే ఛేదించిన సీఐ వెంకటేష్‌నాయక్, సిబ్బందిని అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి అభినందించారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూరల్ పరిధిలోని రాచానపల్లికి చెందిన గంటా దుర్గ, గంటా లలిత, మేకల దుర్గ, చిత్తూరు జిల్లాకు చెందిన తోట లలిత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తూ మహిళల వద్ద ఉన్న బంగారు నగలు కాజేయడం అలవాటుగా చేసుకున్నారన్నారు. ఇందులో భాగంగానే గత సోమవారం కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వస్తున్న బస్సులో నగలు కాజేసి ఆత్మకూరు పోలీసులకు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.7.10 లక్షల విలువజేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులు ఆత్మకూరు, విడపనకల్, కళ్యాణదుర్గం, కూడేరు పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని డీఎస్పీ తెలిపారు. వీరిని అరెస్టు చేసి నగలు రికవరీ చేసిన సీఐ వెంకటేష్‌నాయక్, ఏఎస్ఐ దస్తగిరి, హెడ్ కానిస్టేబుల్ చౌడప్ప, కానిస్టేబుళ్లు ఎస్.సురేష్ నాయక్, ఎమ్.పెద్దన్న, మహమ్మద్ అతీక్, హరికృష్ణ, బొమ్మ శంకర్, మహిళా కానిస్టేబుల్ ఆశాభానును డీఎస్పీ అభినందించారు.

క్రికెట్ సంబురం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఇప్పుడు క్రికెట్ సంబురం నడుస్తోంది. జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి టోర్నమెంటుగా చెప్పుకునే దులీప్ ట్రోఫి ఈసారి అనంతపురం నగరంలో నిర్వహించాలని బిసిసిఐ నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇంతటి అతిపెద్ద టోర్నమెంట్ నిర్వహిస్తుండటంతో అగ్రశ్రేణి క్రికెటర్లు అందరూ విచ్చేయనున్నారు. ఈ ఆటగాళ్లను చూసేందుకు క్రికెట్ అభిమానులు కూడా ఉత్సాహం చూపుతున్నారు. మొత్తం 45 మందికిపైగా క్రీడాకారులు ఒక్కసారిగా రావడం, వారందరూ సుమారు 15 రోజులపాటు ఇక్కడే ఉండి దులీప్ ట్రోఫీలో పాల్గొననున్నారు. ఇప్పటి వరకు ఇంత పెద్ద టోర్నమెంట్ జిల్లాలో జరిగిన దాఖలాల్లేవు. 1964లో ఇరానీ ట్రోఫి ఒకటి పిటిసి మైదానంలో జరిగింది. ముంబయి, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్లు ఈ మ్యాచ్‌లో ఆడాయి. ఆ తరువాత అప్పుడప్పుడు రంజీ మ్యాచ్‌లు జిల్లాలో నడుస్తూ వచ్చాయి. 1963లో ఆంధ్ర, హైదరాబాద్‌ల మధ్య రంజీ మ్యాచ్ జరిగింది. 2004-2005లో ఆంధ్ర, ఇండియన్ రైల్వేస్ మధ్య ఒక మ్యాచ్ జరిగింది. ఆ తరువాత 2005-06లో అత్యధికంగా రంజీ మ్యాచ్‌లో జరిగాయి. ఆంధ్ర, ఉత్తర ప్రదేశ్, కర్నాటక, హర్యానా, కేరళ జట్లు ఇక్కడ ఆడాయి. 2007-08లో ఆంధ్ర, ఉత్తరప్రదేశ్, 2019-20లో మణిపూర్, పాండిచ్చేరీ టీమ్‌లు తలపడ్డాయి. ఆ తరువాత నుంచి పెద్ద టోర్నమెంటులేవి జిల్లాకు రాలేదు. ఆ సమయంలో జహీర్ ఖాన్, మహమ్మద్ కైఫ్, అంబటి రాయుడు, రవీంద్ర జడేజా, సురేష్ రైనా, ఎంఎస్‌కె.ప్రసాద్, యూసుఫ్ పఠాన్, వేణుగోపాల్ రావు, ప్రవీణ్ కుమార్, రాబిన్ ఊతప్ప వంటి ఆటగాళ్లు దేశవాళీ మ్యాచ్‌లు ఆడుతున్న సమయంలో ఇక్కడ ఆడారు. మూడు, నాలుగేళ్ల తరువాత ఇంత పెద్ద టోర్నమెంట్ రావడం అది కూడా ప్రధానమైన ఆటగాళ్లు అంతా విచ్చేస్తుండటంతో యువతలో ఉత్సాహం నెలకొంది. ఈ నెల 5న ప్రారంభమయ్యే ఆటకు ప్రేక్షకులను అనుమతించేందుకు ప్రత్యేకమైన పాస్‌లను శనివారం పంపిణీ చేశారు. ఇదే సమయంలో వర్షాలు కూడా పడుతుండటం గమనార్హం. ఈ ఏడాది వర్షాలు తక్కువ ఉన్న ప్రాంతంలో దులీప్ ట్రోఫీ నిర్వహించాలని బిసిసిఐ



అనంతపురంలో మ్యాచ్‌లను ఆడించే నిర్ణయం తీసుకుంది. అయితే జిల్లాలో గడిచిన రెండు రోజులుగా వర్షాలు పడుతుండటం గమనార్హం. మ్యాచ్ ప్రారంభమయ్యేందుకు ఇంకా నాలుగు రోజులు సమయముంది. అంతలోపు వర్షాలు తగ్గితే మ్యాచ్‌లకు ఇబ్బంది ఉండకపోవచ్చునని నిర్వాహకులు చెబుతున్నారు. ఆర్డీటీ అనంతపురం స్పోర్ట్స్ కాంప్లెక్సులో రెండు మైదానాల్లో ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. వీటిని ప్రత్యక్ష ప్రసారం కూడా చేయనుండటంతో అక్కడికెళ్లలేని వారు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించేందుకు వీలుంది. ఏది ఏమైనా అనంతపురం జిల్లాలో ఇంత పెద్ద టోర్నమెంటు జరగడం ఇదే మొదటి సారి. దీన్ని విజయవంతం చేయడానికి నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసియున్నారు.

'పివికెకె'లో ముగిసిన ఎఫ్‌డిపి శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

నగరం సమీపంలోని పివికెకె ఐటి కళాశాలలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న 'ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ' అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) శనివారం ముగిసింది. చివరి రోజు సెషన్‌లో ఎస్‌వియూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, తిరుపతికి చెందిన ఎలెక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ వి.ఉషారెడ్డి మాట్లాడుతూ కేవలం 10-15 నిమిషాల్లో వాహనాన్ని 80 శాతం వరకూ ఛార్జ్ చేయగలిగే అల్ట్రా ఫాస్ట్ ఛార్జింగ్ సాంకేతికత, ఇతర కంపెనీలు ఆటోనామస్ డ్రైవింగ్‌ని మరింత మెరుగు పరిచేందుకు ఎలక్ట్రిక్ వాహనాల టెక్నాలజీని అనుసంధానం చేస్తుండటం, లిడార్, రాడార్, కృత్రిమ మేధా ఆధారిత సిస్టమ్స్ ద్వారా పూర్తిగా ఆటోనమస్ డ్రైవింగ్ గురించి, పెద్ద టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్స్, వాటిలోని అధునాతన కనెక్టివిటీ ఆప్షన్స్ తదితర అంశాలపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా లో విద్యుత్ వాహనాల సాంకేతికతపై మంచి అవగాహన వచ్చిందన్నారు. ఇలాంటి శిక్షణతో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు తమ సాంకేతిక నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడంతోపాటు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, కోశాధికారి పల్లె సింధూరరెడ్డి హాజరై ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్డాన, ఎఒ మనోహర్‌రెడ్డి, ఎఫ్‌డిపి కన్వీనర్ శ్రీనివాసన్, కో-కన్వీనర్ హరిప్రసాద్, అర్గనైజింగ్ సెక్రటరీ మహేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ఘనంగా ఫ్రెషర్స్ డే

అనంతపురం : అనంతలక్ష్మీ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెఎన్‌టియు అకాడమిక్ డైరెక్టర్ ఎస్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి దేశాల్లో భారతదేశం 4వ స్థానంలో ఉందన్నారు. మొదటి స్థానంలోకి రావాలంటే విద్యార్థులు ఎల్లప్పుడూ కొత్త ఆవిష్కరణలు, ఆలోచనలతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌తోపాటు మొమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ఎం.అనంతరాముడు, కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రామమూర్తి, కళాశాల వైస్ ఛైర్మన్ ఎం.రమేష్‌నాయుడు, కళాశాల నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండు, మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీల్లో పూడిక కనిపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఉన్న మరువవంక, నడిమివంకలో నీటి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ఈ వంకల సమీపంలో ఉన్న కాలనీల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కోరారు.

అన్నదానం

రాయదుర్గం : బ్రహ్మసముద్రం మండలం తిమ్మప్ప కొండ వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదానం చేశారు. శ్రావణ మాసం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, సతీమణి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాన్ని సందర్శించిన భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

శింగనమల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహిళలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ మానసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల కోసమే ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యాకమిటీ ఛైర్మన్ ఎన్నిక

పామిడి : మండలంలోని గజరాంపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా నల్లబోతుల సుజాత, వైస్‌ఛైర్మన్‌గా కొడవండ్ల రమేష్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఇఒ జయానాయక్, గజరాంపల్లి గ్రామపెద్దల సమక్షంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌ను గుమ్మనూరు నారాయణ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, కార్యకర్తలు, జనసేన, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఎస్.సుబహాన్ సేవలు ఆదర్శం



మాట్లాడుతున్న ఎస్‌ఎం.బాషా

అనంతపురం : వ్యవసాయశాఖలో సుబహాన్ 32సంవత్సరాల పాటు ఎంతో నిబద్ధతో విధులు నిర్వహించి ఉద్యోగుల అందరి మన్ననలు పొంది ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయం అని జిల్లా మానవ హక్కుల వేదిక అధ్యక్షులు ఎస్ఎం .బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక అనంతపురం భూసార సంరక్షణ కేంద్రంలో ఎడిఎ ఓబుళపతి అధ్యక్షతన సుభాహాన్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి యు. ఉమామహేశ్వరమ్మ, మానవ హక్కుల వేదిక అధ్యక్షులు బాషా, వ్యవసాయ శాఖ మినిస్టీరియల్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జిల్లా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాహాన్ సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమం ఉరవకొండ తహశీల్దార్ మహబూబ్ బాషా, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వజ్రకరూరు : రైతులు అధికారుల సలహాలు, మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు మాధవీలత, నారాయణస్వామి నటరాజ్ సూచించారు. శనివారం ఉరవకొండ, విడపనకల్ మండలాల పరిధిలోని కోనాపురం, చిన్నముస్టూరు, లత్తవరం, విడపనకల్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన కంది, వేరుశనగ, ఆముదం, సజ్జ, కొర్ర, అంతర పంటలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఇందులో భాగంగా కంది, వేరుశనగ, ఆముదం పంటలకు ఆశించిన చీడపీడలను పరిశీలించి తమ సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, ఉరవకొండ, విడపనకల్ మండలాల వ్యవసాయ అధికారులు శుభకర్, పెన్నయ్య, ఎఇఒ రాఘవేంద్ర, తదితరులు, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

వజ్రకరూరు : ఉరవకొండ పట్టణంలో ఉన్న ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి శుభకర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల కూడా మందులు కొనుగోలు చేసేటప్పుడు క్యూఆర్ కోడ్‌ను పరిశీలించి కొనాలన్నారు. అలాగే మందులకు సంబంధించిన బిల్లులు కూడా తీసుకోవాలన్నారు.

మార్కెట్ యార్డు పదవి కోసం సిఎంకు వినతి

గుత్తి : టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఎన్.సూర్యచంద్రుడు (కరిడికొండ సూరి)కు గుత్తి వ్యవసాయం మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతూ శనివారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి బయోడేటాను అందజేశారు. తాను 30 ఏళ్లుగా టిడిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని కరిడికొండ సూరి చెప్పారు. టిడిపి కార్యకర్తలకు చేదోడు వాదోడుగా ఉంటూ నిస్వార్థంగా పని చేశామన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు ఎన్.సుధాకర్‌నాయుడు, టిడిపి నాయకులు గిరిప్రసాద్ నాయుడు, జిఎం.బాషా, సత్య, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధుల నివారణ

రాయదుర్గం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చని డి.హీరేహాల్ మండలం నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జస్వంత్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం డి.హీరేహాల్ మండలంలోని మురడి గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా నిల్వ ఉన్న నీటిలో అబేట్ పిచికారి చేసి, ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రిడ్జ్‌లు, పూలకుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వృద్ధి చెంది మలేరియా, డెంగీ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. వీటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఎచ్‌ఓ ఖాదర్, ఎఎన్ఎం పుష్పావతి, ఎంఎల్‌హెచ్‌పి మారుతి, ఆశాలు ఎర్రమ్మ, రాధిక, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిణి సరిత

బ్రహ్మసముద్రం : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంటలుసాగు చేసిన రైతులు చీడపీడల నుంచి జాగ్రత్తలు వహించి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారిణి సరిత సూచించారు. శనివారం మండలంలోని పిల్లలమర్రి గ్రామంలో సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం నీరు పొలంలో నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలం ఆరిన తర్వాత అంతర సేద్యం చేయాలన్నారు. సిఫార్సు చేసిన ఎరువులు మాత్రమే వాడాలన్నారు. చీడపీడలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అధిక వర్షాల వల్ల పంటల్లో మొగ్గలు, పూత, కాయలు ఎక్కువగా రాలిపోతుంటే రైతులు ఫ్లోనోఫిక్స్ ఎకరానికి 50 మిల్లీలీటర్లను 225 లీటర్ల నీటితో కలిపి మొక్కలంతా బాగా తడిసేటట్లు పిచికారీ చేసుకోవాలన్నారు.

3 నుంచి కంప్యూటర్, యోగా శిక్షణ

అనంతపురం : అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటిఐలో ఈనెల 3వతేదీ నుంచి ప్రత్యేకించి మహిళలకు కంప్యూటర్, వెబ్ డెవలపర్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్ అంశాలు, యోగా ఇన్‌స్ట్రక్షన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పిన్సిపాల్ రామమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ బయోడేటా, 10, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు సమర్పించి ఐటిఐ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

14, 15 తేదీల్లో ఉచిత వక్త శిక్షణ తరగతులు

యాడికి : ఈనెల 14, 15వ తేదీల్లో డిగ్రీ నుంచి పీజీ వరకూ చదువుతున్న విద్యార్థులకు ఉచిత వక్త శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా స్టెప్ సమన్వయకర్త రత్నకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ఆత్మన్యూనతాభావాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు ఉచిత వసతి, భోజనంతోపాటు సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోవాలనుకునే వారు సెల్..90306 44440, 81432 34555, 97033 79608 నెంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నార్పల : మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఎస్ఎంసి ఛైర్మన్ రవికుమార్, ప్రిన్సిపాల్ సంగీతకుమారితో కలిసి శనివారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నార్పల : జిల్లావ్యాప్తంగా రెండు, మూడు రోజుల్లో భారీ వర్ష సూచన ఉండడంతో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలతో మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ అరుణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఇన్‌ఛార్జిలను నియమించామన్నారు. విఆర్‌ఒ వెంకటేశ్వర్‌రావు, సెల్..93926 68868 ఉదయం 6 నుంచి రెండు గంటల వరకూ, విఆర్‌ఒ కీర్తి సెల్..99121 02519 రెండు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ, విఆర్‌ఒ రామకృష్ణ సెల్..79894 79838 రాత్రి పది గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ అందుబాటులో ఉంటారన్నారు.

గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించాలి

బెలుగుప్ప : జిల్లాలోని గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారన్నారు. ఆ భవనాల్లో కూడా గోడలు నెర్రలు చీలి పైకప్పు విద్యార్థులపై కూలిపోయే ప్రమాదాలు ఉన్నాయన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గురుకులాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

రానున్న రెండు రోజులు వర్షాలు

యల్లనూరు : బంగాళాఖతం ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం కురుస్తుంది. దీంతో మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. వార్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ నాగరాజు సూచించారు.

ప్రశాంతంగా చవితి వేడుకలు చేసుకోండి

యల్లనూరు : ఈనెల 7వతేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకలను మండల ప్రజలు సంతోషంగా చేసుకోవాలని సిఐ సుబ్రమణ్యం కోరారు. మండలంలోని వివిధ గ్రామాల పెద్దలు, ప్రజలు వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి కోసం శనిఆవరం పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పండుగను ప్రతి ఒక్కరూప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అంతేగాకుండా షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేస్తామని, ఎవరూ షరతులను అతిక్రమించకుండా పండుగ చేసుకోవాలన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

బొమ్మనహాల్ : శ్రావణమాసం ఆఖరి శనివారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి అమృతాభిషేకం, కుంకుమార్చన, తమలపాకల పూజ, వెండి కవచం, సువర్ణ కిరీటధారణ అలంకరించి పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి నర్సింహారెడ్డి తెలిపారు.

రాయదుర్గం సిఐగా జయనాయక్



రాయదుర్గం : రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్‌గా జె.జయనాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఆయన బదిలీపై రాయదుర్గం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణకు కృషి చేస్తానన్నారు.

గుత్తి కమిషనర్‌గా జబ్బార్‌మియా



గుత్తి : స్థానిక మున్సిపల్ నూతన కమిషనర్‌గా బి.జబ్బార్‌మియా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న జి.శ్రీనివాసులు పెనుగొండ మున్సిపల్ కమిషనర్‌గా, కడప జిల్లా మైదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.జబ్బార్‌మియాను ఇక్కడికి బదిలీ చేశారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్‌ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


ఆంజనేయస్వామి రథోత్సవం

రాయదుర్గం : పట్టణ పొలిమేరలో జాతీయ రహదారి 544-డి పక్కన వెలసిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ఆకుపూజ, పంచామృతాభిషేకం, నవగ్రహాలకు తైలాభిషేకం చేశారు. ఐదురోజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 29న కలశస్థాపన, 30న హోమాలు నిర్వహించారు. శనివారం ఆలయం నుంచి వినాయక కూడలి వరకు మడుగు తేరు, బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో అనేకమంది భక్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలి తొలగింపు బాధాకరం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 18ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకురాలిగా పని చేస్తున్న జయమ్మను తొలగించడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. జయమ్మ కొన్నేళ్ల నుంచి మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకురాలితోపాటు సిఐటియు మండల కార్యదర్శిగా పని చేస్తోందన్నారు. ఈనేపథ్యంలో ఏ కారణం లేకుండా తొలగించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే జయమ్మను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ




వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఖాసీంబీ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని ముప్పులకుంట గ్రామంలో ఉన్న మెయిన్ అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాలలను ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఖాసీంబీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాల్లో పిల్లల హాజరు, భోజన వసతి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల హాజరు, పిల్లల బరువులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన గృహ సందర్శనలో పిల్లల తల్లులకు పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం, తల్లిపాల ప్రాముఖ్యం సీజనల్ వ్యాధులు, పిల్లల పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తిప్పమ్మ, నింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 6గంటలకే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు

పాల్గొన్న అధికారులు, నాయకులు



వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ, నాయకులు

మండలంలోని బి.యాలేరు గ్రామంలో శనివారం ఉదయమే 6 గంటలకే ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. కలెక్టర్ వినోద్‌కుమార్ నేరుగా లబ్ధిదారు ఇంటికే వచ్చి పింఛన్ల పంపిణీని పరిశీలించారు. ఈ ఒసదర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలిరోజే వందశాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకున్నామన్నారు. పూర్తిగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, తహశీల్దార్ లక్ష్మానాయక్, ఎంపిడిఒ శివశంకర్, ఎపిడి అనురాధ, సర్పంచి రేణుకమ్మ, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమానికి అత్యంత ప్రాముఖ్యత ఇస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఉదయం 6 గంటలకే గుమ్మగట్ట మండలం గోనబావి గ్రామంలో చేపట్టిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా ప్రతినెలా 1వతేదీనే పింఛన్లు పంపిణీ చేస్తుండగా సెప్టెంబర్ 1వతేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీకి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఒ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : పేదల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడుయాదవ్ అన్నారు. శనివారం స్థానిక పట్టణంలోని చెంబులభావి వీధిలో చేపట్టిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం లబ్ధిదారులకు పింఛన్లను పెంచి అందజేస్తున్నట్లు చెప్పారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంకె.చౌదరి, లక్ష్మణ్ చౌదరి, బి.వేణుగోపాల్, కోనంకి కృష్ణ, టి.సురేష్‌బాబు, టి.సుధాకర్, జి.సుంకన్న, పవన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలవ్యాప్తంగా శనివారం ఉదయం 6 గంటల నుంచే సచివాలయ అధికారులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ మొదలుపెట్టారు. పింఛన్ల పంపిణీని మండల ప్రత్యేక అధికారి ఆంజనేయులు, ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, అడ్మిషన్ ఆఫీసర్ శ్రీధర్, ఎపిఒ చెన్నకేశవులు, ఎంఇఒ శ్రీదేవి పరిశీలించారు.

శింగనమల : మండలవ్యాప్తంగా పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటలకే పింఛన్‌దారుల వద్దకు చేరుకుని పింఛనఉల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిఇఒ ఉమాదేవి, టిడిపి నాయకులు కాయల రాజశేఖర్‌యాదవ్, మహేష్‌యాదవ్, కోనప్ప, రామాంజనేయ, బోయ నరేష్, చలపతి, వెంకటేష్, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఉదయం 6 గంటల నుంచే అధికారులు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకే మండల వ్యాప్తంగా 70శాతం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ దివాకర్ తెలిపారు. అధికారులు వర్షాన్ని సైతం లెక్కజేయకుండా అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ అరుణకుమారి, ప్రత్యేక అధికారి రత్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రవీందర్‌నాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, వెటర్నరీ డాక్టర్ గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల వ్యాప్తంగా 5,620 మంది పెన్షన్‌దారులు ఉండగా శనివారం 5,367 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ వీరరాజు తెలిపారు. ఉదయం 6 గంటలకే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

అనంతపురం రూరల్ : రూరల్ పరిధిలో శనివారం 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారని తెలిపారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే 2వ తేదీ సోమవారం తీసుకోవాలని కోరారు.

వజ్రకరూరు : ఉరవకొండ పట్టణ పరిధిలోని అన్ని సచివాలయ పరిధిలో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ పంపిణీ చేసినట్లు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ తెలిపారు. గ్రామపంచాయతీ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో వర్షం పడుతున్నప్పటికీ వందశాతం పంపిణీ చేసినట్లు తెలిపారు.

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా శనివారం చేపట్టిన పింఛన్ల పంపిణీని ఎంపిడిఒ దాసానాయక్, ఇఒఆర్‌డి వెంకటనాయుడు, ఎపిఒ రాజ్యలక్ష్మి పరిశీలించారు. మండలంలో వ్యాప్తంగా 14 సచివాలయాల పరిధిలో 95.03 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపి అవినాష్, తదితరులు పాల్గొన్నారు.